అక్కినేని కుటుంబంపై పగ!

- నాగార్జున లక్ష్యంగా ఇండస్ట్రీపై రేవంత్ సర్కార్ దాదాగిరి
- అంతర్గత ఎజెండాతో ఏఎన్నార్ ఫ్యామిలీకి ఇక్కట్లు!
- అమరావతి నుంచి ఆదేశాల మేరకే ఎన్ కన్వెన్షన్ నేలమట్టం?
- వివాదాలకు దూరంగా ఉన్నా బయటకు లాగి ఇబ్బందులు
- సర్కార్‌పై ప్రజా వ్యతిరేతను కప్పిపుచ్చేందుకు మరోసారి టార్గెట్
- కూల్చివేతలపై గట్టిగా పోరాడుతున్న కేటీఆర్‌తో ముడి
- బలం చేకూరుస్తున్న మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు!
- పలువురు కాంగ్రెస్ నేతల్లోనూ అసహనం.. ఆగ్రహం
- రగిలిపోతున్న నాగార్జున అభిమానులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 'హైడ్రా' అవతరించిన కొద్ది రోజులకే ప్రముఖ సినీహీరో అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను నేటమట్టం చేసింది. కోర్టు ఆదేశాలు వచ్చేలోగానే 'సెలవుల అదును' చూసి కూల్చివేసింది. కొంతకాలంగా తన వెనుక జరుగుతున్న వ్యవహారాలపై నాగార్జున మౌనంగానే ఉన్నా.. మరోసారి 'అక్కినేని ఫ్యామిలీ' లక్ష్యంగా కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయడం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. తొలి నుంచి కాంగ్రెస్‌కు అనుకూలురుగా ఉన్న అక్కినేని కుటుంబాన్ని ఇప్పుడు రేవంత్ సర్కార్ టార్గెట్ చేసిందని సినీవర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలోనే కొందరికి మింగుడు పడడం లేదని తెలుస్తున్నది. 'ఎన్ కన్వెన్షన్' కూల్చివేత వెనుక అమరావతి నుంచి వచ్చిన ఆదేశాలు ఉన్నాయనే వాదనలు ఇండస్ట్రీ వర్గాల్లో బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలుడిగా ఇండస్ట్రీలో నాగార్జునకు పేరుందని, జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఇండస్ట్రీ పెద్దలు పలుమార్లు ఆయనను కలిసి సమస్యలపై చర్చించారని, అయితే ఓ వర్గానికి చెందిన హీరోను లక్ష్యంగా చేసుకొని జగన్ సానుకూలంగా స్పందించలేదని, ఈ వ్యవహారంలో నాగార్జున ఎవరి పక్షం లేకున్నా ఆయన జగన్‌కు అనుకూలమనే ప్రచారం జరిగిందని, ఈ కారణంగానే ఇక్కడ రేవంత్ సీఎం కాగానే 'ఎన్ కన్వెన్షన్' కూల్చివేతకు ఏపీ నుంచి ఆదేశాలు వచ్చాయని, ఇండస్ట్రీ కోణంలో ఇదో కక్షపూరిత చర్య అని సినీరంగానికి చెందిన ఓ ప్రముఖుడు వెల్లడించారు. ఉద్యోగాలు, రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం కారణంగా ఆదిలోనే వచ్చిన ప్రజావ్యతిరేకతను హైడ్రా కూల్చివేతలతో కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ సర్కార్, తాజాగా కూల్చివేతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అక్కినేని కుటుంబంతో ముడిపెట్టి 'రాజకీయం' చేస్తున్నదని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రి సురేఖ వ్యాఖ్యలతో షాక్‌లో ఇండస్ట్రీ

అగ్ర నటుడు నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాలను షాక్‌కు గురిచేశాయి. రాజకీయ ప్రయోజనాల కోసం ఓ లెజెండరీ సినీ కుటుంబంపై అభూతాండాలు వేయడం సినీ ప్రముఖులను విస్మయానికి గురిచేసింది. కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే నాగార్జున కుటుంబాన్ని రేవంత్ ప్రభుత్వం రాజకీయ పరమైన హిడెన్ ఎజెండాతో కావాలనే ఇబ్బంది పెడుతున్నదని, ఇది ఓ రకంగా ఇండస్ట్రీపై జరుగుతున్న నైతిక దాడి అని పలువురు సినీరంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్‌లో సినీరంగం స్థిరపడటానికి ప్రధాన భూమిక పోషించిన లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు కుటుంబాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని, ఇది అత్యంత బాధాకరమని వాపోతున్నారు. సినీరంగంలో వరుస పరిణామాలు భవిష్యత్తులో ఇండస్ట్రీ మనుగడపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

జగన్‌కు అనుకూలంగా ఉన్నాడనేనా?

రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన కుటుంబంతో నాగార్జున సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. నాగార్జున మేనల్లుడు సుమంత్, జగన్మోహన్‌రెడ్డి పాఠశాల రోజుల్లో క్లాస్‌మేట్స్. ఈ కారణంగా కూడా నాగార్జున, జగన్మోహన్‌రెడ్డి మధ్య సఖ్యత ఏర్పడిందని చెప్తారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఇండస్ట్రీ సమస్యలపై పలువురు పెద్దలు కలిసి చర్చించినా ఆయన ఓ హీరోను లక్ష్యంగా చేసుకొని సానుకూలంగా స్పందించలేదనే అసంతృప్తి ఉండేది. ఈ కారణంగా సినీరంగంతో జగన్‌కు దూరం పెరిగింది. ఈ వ్యవహారంతో నాగార్జునకు ఎలాంటి సంబంధం, పక్షపాతం లేకున్నా జగన్ అనుకూలుడనే ప్రచారం జరిగింది. ఇక్కడ కాంగ్రెస్ సర్కార్‌లో రేవంత్‌రెడ్డి సీఎం కావడం, ఏపీలో జగన్ ఓడిపోయి చంద్రబాబు అధికారంలోకి రావడంతో ప్రతీకార రాజకీయాలు మొదలయ్యాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే అమరావతి నుంచి అందిన ఆదేశాల మేరకు 'బుల్డోజర్' ఎన్ కన్వెన్షన్ వైపు మళ్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇండస్ట్రీకి రేవంత్ బెదిరింపులు

పదేళ్ల కేసీఆర్ హయాంలో తెలుగు సినీ రంగానికి ఎప్పుడూ ఇబ్బందులు ఎదురు కాలేదు. ఇండస్ట్రీకి సంబంధించిన ప్రతి అంశంలో కేసీఆర్ సానుకూలంగా స్పందించేవారు. 2019 ఏపీ ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ నాటి టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు చేశారు. 'తెలంగాణ ఏమైనా పాకిస్తానా? అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. అయినా అవేమీ మనసులో పెట్టుకోకుండా పవన్‌కల్యాణ్ 'భీమ్లానాయక్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు కేటీఆర్ ముఖ్య అతిథిగా వెళ్లారు. తాను పవన్‌కల్యాణ్ అభిమానినని పొగడ్తల్లో ముంచెత్తారు. రాజకీయాలతో ఇండస్ట్రీని ముడిపెట్టకుండా కేటీఆర్ వ్యవహరించిన తీరు అందరి ప్రశంసలందుకున్నది. అయితే రేవంత్ సర్కార్ రాకతో ఇండస్ట్రీల్లో పరిస్థితులన్నీ ఒక్కసారిగా మారిపోయాయని, తొలి నుంచీ ఆయన బెదిరింపు ధోరణిలోనే వ్యవహరిస్తున్నారని పలువురు ఇండస్ట్రీకి చెందినవారు చెప్తున్నారు. సాధారణంగా సినీ తారలు ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం నచ్చితే స్వచ్ఛందంగా ప్రచారం చేసేందుకు ముందుకొస్తారు. కానీ డ్రగ్స్‌పై అవగాహన పెంచే కార్యక్రమం విషయంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో భయాలను రేకెత్తించాయి. సినీ నటులు తప్పకుండా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో పాల్గొనాలని, అందుకు సంబంధించిన వీడియోలు చేయాలని, లేదంటే వారి సినిమాలకు అనుమతులు ఇవ్వబోమని ఓ సభలో సీఎం రేవంత్ హెచ్చరించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకూ తమను ఏ ముఖ్యమంత్రి ఈ రీతిలో బెదిరించలేదని ఇండస్ట్రీవర్గాల్లో చర్చ జరిగింది. 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సినీ ఇండస్ట్రీని ఓ రకంగా బ్లాక్‌మెయిల్ చేసే ధోరణి కనిపిస్తోంది. నయానోభయానో మమ్మల్ని దారికి తెచ్చుకోవాలనే ధోరణి కనిపిస్తున్నది. గతంలో ఈ తరహా వైఖరిని ఏ ప్రభుత్వంలో చూడలేదు' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ నిర్మాత తెలిపారు.

మరింత అగ్గిరాజేసిన సురేఖ వ్యాఖ్యలు

ఇప్పటికే సర్కార్‌పై అసహనం వ్యక్తం చేస్తున్న సినీ ఇండస్ట్రీలో కొండా సురేఖ వ్యాఖ్యలు మరింత అగ్గి రాజేశాయి. సినీ హీరోయిన్లను అవమాన పరిచేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. అక్కినేని కుటుంబాన్ని అభాసుపాలు చేసేలా ఆమె మాట్లాడటాన్ని నాగార్జున అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. తెలుగు సినిమా వైభవానికి ఎంతగానో కృషి చేసిన లెజెండరీ అక్కినేని ఫ్యామిలీపై ఇంతలా దిగజారుడు రాజకీయాలు చేయడమేమిటని మండిపడుతున్నారు. అక్కినేని కుటుంబం నుంచి ప్రస్తుతం నాగార్జున, నాగచైతన్య, అఖిల్, సుమంత్, సుశాంత్ వంటి హీరోలున్నారు. ఇప్పటివరకు వీరంతా వివాద రహితులుగా పేరు తెచ్చుకున్నారు. అక్కినేని కుటుంబం సేవా కార్యక్రమాలపరంగా కూడా ఎప్పుడూ ముందుంటుంది. అక్కినేని అమల బ్లూక్రాస్ ద్వారా జంతు సంరక్షణకు కృషి చేస్తున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా కొన్ని వందల మంది సినీ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇండస్ట్రీ పిల్లర్స్‌లో ఒకటైన అక్కినేని కుటుంబాన్ని తొలుత ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో ఇబ్బందులు పెట్టి, ఇప్పుడు కేటీఆర్‌తో ముడిపెట్టి వివాదాల్లోకి లాగుతున్నారనే చర్చ కొనసాగుతున్నది. అటు ఏపీ డైరెక్షన్‌లో నాగార్జున, ఇటు ప్రభుత్వ కూల్చివేతల చర్యలపై గట్టిగా పోరాడుతున్న బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను ప్రజల్లో చులకన చేయాలనే కుట్రతోనే రేవంత్ రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని పలువురు రాజకీయ ప్రముఖులు స్పష్టం చేస్తున్నారు. ఏదేమైనా ఇలా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని హితవుపలుకుతున్నారు.

వివాదాలకు దూరంగా అక్కినేని కుటుంబం

తొలి నుంచీ అక్కినేని ఫ్యామిలీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తున్నది. ఏఎన్నార్ కాంగ్రెస్‌వాదిగా ఉన్నా ఆయన ఏనాడూ బాహాటంగా పార్టీని సమర్థించలేదు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అన్నపూర్ణ సెవెన్ ఎకర్స్ విషయంలో ఏఎన్నార్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారన్న వాదనలు ఉన్నాయి. స్టూడియో లీజును రద్దు చేయించాలని ప్రయత్నించగా కోర్టుల ద్వారా ఆ వివాదం సమసిపోయింది. అనంతరకాలంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ సఖ్యతగానే ఉన్నారు. ఆ తర్వాత అక్కినేని కుటుంబానికి ఎప్పుడూ రాజకీయపరమైన ఇబ్బందులు ఎదురుకాలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో అక్కినేని నాగార్జున కూడా సన్నిహిత సంబంధాలు నెరిపారు. అప్పటి ప్రభుత్వ పథకాలకు ప్రచారకర్తగా కూడా పనిచేశారు. అయితే ఎలాంటి రాజకీయపరమైన కార్యకలాపాల్లోగాని, పార్టీ ప్రచారంలో గాని నాగార్జున పాల్గొనలేదు. తొలినుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలురుగా ఉన్న అక్కినేని కుటుంబాన్ని ఇప్పుడు టార్గెట్ చేయడం ఏమిటని కాంగ్రెస్ పార్టీలోనే కొందరు నేతలు రేవంత్‌రెడ్డి తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది.

సురేఖ వ్యాఖ్యలు అబద్ధం: నాగార్జున

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : 'మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం. అబద్ధం' అని సినీ నటుడు అక్కినేని నాగార్జున స్పష్టంచేశారు. 'రాజకీయాలకు దూరంగా ఉండే సినీప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థులను విమర్శించేందుకు వాడుకోకండి.. సాటి మనుషుల వ్యక్తిగత జీవితాలను గౌరవించండి' అని సూచించారు. సురేఖ వ్యాఖ్యలను బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఖండించారు. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మంత్రి కొండా సురేఖ వాఖ్యలు తమ కుటుంబం పట్ల, చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, అబద్ధమని తేల్చిచెప్పారు. తక్షణమే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ స్పందించాలి: అమల

తమ కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అసంబద్ధ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సినీ నటుడు అక్కినేని నాగార్జున సతీమణి, నటి అక్కినేని అమల ఫిర్యాదుచేశారు. తన కుటుంబంపై సురేఖ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాజకీయ వివాదాల్లోకి తమను లాగవద్దని, తన భర్త గురించి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఘాటుగా స్పందించారు. 'రాజకీయ నాయకులే నేరస్థుల్లా ప్రవర్తిస్తే ఈ దేశం ఏమైపోతుంది? సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పేలా రాహుల్ గాంధీ చొరవ తీసుకోవాలి' అని అమల డిమాండ్ చేశారు.

అసహ్యం వేస్తున్నది: నాని

ఏ చెత్తయినా మాట్లాడి తప్పించుకోవచ్చని భావించే రాజకీయనాయకులను చూస్తే అసహ్యం వేస్తున్నదని సినీ నటుడు నాని పేర్కొన్నారు. సమంత, నాగచైతన్య విడాకుల అంశం మీద మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాని స్పందించారు. ఇంత బాధ్యతారహితంగా మాట్లాడేవారు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ఉంటారని ఆశించడం తమ తెలివితక్కువతనమే అవుతుందని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ఎటువంటి ఆధారం లేకుండా మీడియా ముందు చెత్త మాట్లాడితే చెల్లుతుందనుకోవడం చెల్లదని ఘాటుగా వ్యాఖ్యానించారు. సమాజంపై దుష్ప్రభావం చూపే ఇటువంటి ప్రయత్నాలను ఖండించాలని కోరారు.

మంత్రి బాధ్యతతో మాట్లాడాలి

మొదటిపేజీ తరువాయి...

గ్రహించాలని చురక అంటించారు. ఇతరుల వ్యక్తిగత విషయాల పట్ల మాట్లాడేటప్పుడు బాధ్యతగా, గౌరవంగా ఉండాలంటూ హుందాగా హితవు చెప్పారు. విడాకులు తన వ్యక్తిగత విషయమని, దయచేసి దానిపై ఊహాగానాలు మానుకోవాలని పరోక్షంగా హెచ్చరించారు. తమ వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచుకోవడం అంటే ఇతరులు వాటిని తప్పుగా ప్రచారం చేయడం కాదని ఉద్బోధించారు. సమంత విడుదల చేసిన ప్రకటన పూర్తి పాఠం ఇలా ఉంది. 'మహిళగా ఉండటానికి, బయటకు వచ్చి పని చేయడానికి, గ్లామర్ పరిశ్రమంలో నిలబడి పోరాడటానికి చాలా ధైర్యం, బలం కావాలి. కొండా సురేఖ గారు.. ఈ ప్రయాణం నన్ను మార్చినందుకు గర్వపడుతున్నా. దయచేసి చిన్నచూపు చూడకండి. మంత్రిగా మీ మాటలకు ఎంతో ప్రాధాన్యముంటుందని మీరు గ్రహించారని భావిస్తున్నాను. వ్యక్తుల వ్యక్తిగత విషయాల గుర్తించి మాట్లాడేటప్పుడు బాధ్యతగా, గౌరవంగా ఉండాలని వేడుకుంటున్నా. నా విడాకులు నా వ్యక్తిగత అంశం. దానిపై ఊహాగానాలు మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. మా వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచాలని అనుకోవడం అంటే ఇతరులు దానిపై తమ ఇష్టం వచ్చినరీతిగా మాట్లాడాలని కాదు. నా విడాకులు పరస్పర అంగీకారం, సామరస్యపూరకంగా జరగాయని స్పష్టం చేస్తున్నా. ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదు. మీ రాజకీయ వివాదాల నుంచి నా పేరు ను దూరంగా ఉంచగలరా? నేను ఎప్పుడూ రాజకీయాలకు అతీతంగా ఉంటాను. అలాగే ఉండాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.

కొండా వ్యాఖ్యలు సిగ్గుచేటు: నాగచైతన్య

మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను సినీ నటుడు నాగచైతన్య ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. మంత్రి వ్యాఖ్యలు అసత్యమని, అవి హాస్యాస్పదం, ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. మహిళలకు మద్దతునిచ్చి, వారిని గౌరవించాలని అన్నారు. సెలబ్రిటీలు తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం తగదని పేర్కొన్నారు.

దీక్ష విరమించిన పవన్‌కల్యాణ్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనా, దర్శకుడు త్రివిక్రమ్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద సాయితో కలిసి శ్రీవారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం తిరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. వారాహి డిక్లరేషన్ బుక్‌తో ఆలయం వెలుపలకు పవన్ రావడాన్ని భక్తులు ఆసక్తిగా గమనించారు. అంతకు ముందు చిన్న కుమార్తె పొలెనా అంజనా స్వామివారి దర్శనానికి డిక్లరేషన్ ఇచ్చారు. పొలెనా మైనర్ కావడంతో ఆమె తరపున తండ్రిగా డిక్లరేషన్ పత్రాలపై పవన్ సంతకాలు చేశారు. తిరుమలలో చిరుతల నుంచి రక్షణకు అటవీ శాఖ చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురువారం సాయంత్రం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిర్వహించే వారాహి సభలో పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు.

దసరాకు టీజర్

రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు రూపొందించిన ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ప్రచార పర్వంలో భాగంగా ఇటీవలే రెండో పాటను విడుదల చేశారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించడంతో టీజర్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నెలలోనే టీజర్‌ను రిలీజ్ చేస్తామని నిర్మాత దిల్‌రాజు కన్‌ఫర్మ్ చేశారు. తాజా సమాచారం ప్రకారం దసరా సందర్భంగా ఈ నెల 12న టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాజకీయ, సామాజికాంశాలను చర్చిస్తూ తనదైన శైలిలో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, అంజలి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సముద్రఖని కీలక పాత్రలను పోషిస్తున్నారు.

వేట్టయాన్ యాక్షన్ హంగామా

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'వేట్టయాన్–ది హంటర్' ట్రైలర్ బుధవారం విడుదలైంది. ఈ సినిమాలో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం దసరా సందర్భంగా ఈ నెల 10 ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ అంశాలతో సాగింది. 'క్రైమ్ క్యాన్సర్‌లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్. నా నుంచి వాడిని కాపాడటం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ చెప్పిన డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. ట్రైలర్‌లో అమితాబ్‌బచ్చన్, రానా, ఫహద్ ఫాజిల్ పాత్రలను పరిచయం చేసిన తీరు, వారు చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. రజనీకాంత్ తనదైన స్టైల్, మేనరిజమ్స్‌తో మెప్పించారు. పోలీస్ వ్యవస్థకు, సంఘ విద్రోహక శక్తులకు మధ్య జరిగే పోరు నేపథ్యంలో సినిమాను తెరకెక్కించారని ట్రైలర్‌ను చూస్తే అర్థమవుతున్నది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందించారు.

ఆ వార్తల్లో నిజం లేదు!

'యానిమల్' చిత్రంతో ఓవర్‌నైట్‌లో స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది కథానాయిక త్రిప్తి డిమ్రి. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీగా ఉంది. తాజాగా ఆమె ఓ వివాదంలో చిక్కుకుంది. వివరాల్లోకి వెళితే..ఇటీవల జైపూర్‌లో మహిళా పారిశ్రామిక వేత్తలు ఓ సదస్సును నిర్వహించారు. దీనికి పలువురు బాలీవుడ్ స్టార్స్‌ను కూడా ఆహ్వానించారు. వారిలో త్రిప్తి డిమ్రి కూడా ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నిర్వాహకులు ఆమెకు ఐదు లక్షల రూపాయలను అందించారని తెలిసింది. అయితే తన తాజా చిత్రం 'విక్కీ విద్యా వోవాలా వీడియో' ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్ల త్రిప్తి డిమ్రి మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరుకాలేకపోయింది. దీంతో నిర్వాహకులు ఆమె వ్యవహార శైలిని తప్పుబడుతూ, ఈవెంట్‌లో ఏర్పాటు చేసిన ఆమె పోస్టర్లను ధ్వంసం చేశారు. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై త్రిప్తి డిమ్రి వ్యక్తిగత టీమ్ స్పష్టత నిచ్చింది. జైపూర్ ఈవెంట్‌లో పాల్గొనడానికి త్రిప్తి డబ్బులు తీసుకుందనే వార్తలు పూర్తి అవాస్తవమని, సినిమా ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్లే అక్కడకు వెళ్లలేకపోయిందని వివరణ ఇచ్చారు. 'వృత్తిపరంగా త్రిప్తి చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది. ప్రైవేట్ ఈవెంట్స్‌కు కూడా ఆమె డబ్బులు తీసుకోదు. దయచేసి ఈ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టండి' అని ఆమె టీమ్ స్పష్టం చేసింది.

ఇప్పటివరకు రాని కథ

పరుచూరి సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. రవికిషోర్ దర్శకత్వం వహించారు. ఆర్‌పీ సినిమాస్ పతాకంపై చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మించారు. ఈ నెల 4న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో రానా విడుదల చేశారు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో ట్రైలర్‌ను తెరకెక్కించారని, ఆద్యంతం ఉత్కంఠను పంచిందని రానా చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఇప్పటివరకు రాని ఓ ఇంట్రస్టింగ్ పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. వరలక్ష్మీ శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, రచన–దర్శకత్వం: చందిన రవికిషోర్.

నాని సరసన శ్రీనిధి

నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ప్రస్తుతం వైజాగ్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో నాని సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నది. కథానుగుణంగా ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, వైజాగ్ షెడ్యూల్‌లో శ్రీనిధి శెట్టి పాల్గొంటున్నదని చిత్ర బృందం పేర్కొంది. నాయకానాయికలపై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నామని, పోలీస్ ఆఫీసర్‌గా నాని పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారని చిత్ర బృందం పేర్కొంది. 2025 మే 1న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, రచన–దర్శకత్వం: శైలేష్ కొలను.

చాలా రోజులు గుర్తుండిపోతుంది

'వంశాలు, తరాల నేపథ్యంలో జరిగే పెద్ద కథ ఇది. దీనిని తెరపై తీసుకురావడం అంత సులభం కాదు. ఇప్పటివరకు ఏ సినిమాలో నేను డబుల్ యాక్షన్ చేయలేదు. అలాంటిది ఇందులో నాలుగు పాత్రల్ని పోషించాను' అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన నటించిన తాజా చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 4న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమా కథలో కామెడీతో పాటు హృదయాల్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి. చాలా రోజుల పాటు గుర్తుండిపోతుంది. కుటుంబ సమేతంగా చూసి ఆనందించేలా సినిమాను తీర్చిదిద్దాం' అన్నారు. ఈ సినిమాలో శ్రీవిష్ణు పోషించిన నాలుగు పాత్రలు వేటికవే ప్రత్యేకంగా కనిపిస్తాయని, కమల్‌హాసన్ తరహాలో నాలుగు పాత్రల్ని ధైర్యంగా చేశారని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. దర్శకుడు హసిత్ గోలి మాట్లాడుతూ 'శ్రీవిష్ణు నాలుగు పాత్రల్లో అద్భుతమైన నటన కనబరిచాడు. వివేక్‌సాగర్ మ్యూజిక్ ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఘట్టాలు ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి' అన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన మహారాణి పాత్ర చాలా కొత్తగా ఉంటుందని కథానాయిక రీతూవర్మ చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

'ఫణి' వెనకున్న రహస్యం

కేథరిన్ ట్రెసా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఫణి'. వీఎన్ ఆదిత్య దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నారు. ఓఎంజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఈ సినిమా బ్యానర్ లోగో, టైటిల్ ఆవిష్కరణ